

4వ నివేదిక

జనవరి 24, 2026

# ఇక్కడ వైఫల్యం లేదు

**జాన్–వనాటు**

నా పేరు జాన్, నేను వనాటు తీరంలో ఉన్న మాస్కెలిన్ అనే చిన్న ద్వీపంకు చెందిన వాడను. వనాటు దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని ఒక చిన్న ద్వీప దేశం. నేను మెరిసే సముద్రపు అలలు మరియు దట్టమైన వర్షారణ్యాల మధ్య పెరిగాను.

నేను ఇతర పిల్లల్లాగే పాఠశాలకు వెళ్ళాను కానీ అక్కడ నేను అంతగా ఆనందించలేదు. నేను అంత తెలివైన విద్యార్థిని కాదు. నిజానికి, నా తరగతిలో నాకు అందరికంటే అత్యల్పమైన మార్కులు వచ్చాయి. నాకు పాఠశాల ఇష్టం లేదని మా నాన్నకు తెలుసు, కానీ ఆయన ఇప్పటికీ నా గురించి ఒక సాధారణ కల కలిగి ఉన్నాడు. ఆయన, "నువ్వు ఆరవ తరగతి పూర్తి చేసేటప్పటికీ నీ పేరు చదవడం మరియు వ్రాయడం నేర్చుకో, అది చాలు" అని అన్నాడు.

ఆరవ తరగతిలో ఒక రోజును నేను ఎప్పటికీ మర్చిపోలేను. మేము ఒక పరీక్ష రాస్తున్నాము. నా టీచర్ నా పేపర్ చూసి నిట్టూర్చింది. "జాన్, నువ్వు ఎప్పటికీ మారవు. నువ్వు మీ తల్లిదండ్రుల డబ్బును వృధా చేస్తున్నావు . నీకు చదవాలని ఎటువంటి ఉద్దేశ్యం లేదు." అని ఆమె చెప్పింది. ఆ "తర్వాత, ఆమె నా పుస్తకాలను కిటికీలోంచి విసిరి, నా క్లాస్‌మేట్‌లతో నన్ను చూసి నవ్వమని చెప్పింది. అందరూ చూస్తుండగా నా పుస్తకాలు తీసుకోవడానికి నేను బయటికి పరిగెత్తాల్సి వచ్చింది.

ఆ క్షణంలో నాలో ఏదో తీవ్రమైన మానసిక బాధ కలిగి మనస్సు వికలమయ్యింది. నేను విలువలేనివాడినని అనిపించింది. కానీ నా అంతరంగంలో, నా ప్రయత్నాన్ని వదులుకోవద్దని ఏదో నాకు చెప్పింది.

ఆ సంవత్సరం తరువాత, ఒక క్లాస్మేట్ జోక్ చేశాడు, "జాన్, నువ్వు పరీక్షల్లో ఫెయిల్ అయి ద్వీపంలోనే ఉన్నప్పుడు, నా కోసం చేపలు పట్టడానికి నిన్ను నియమిస్తాను." నేను నవ్వాను కానీ నాకు అలాంటి జీవితం వద్దు అని తెలుసు. నాకు ఇంకేదో కావాలి.

సెవెంత్–డే అడ్వెంటిస్టుగా మారిన నా అన్నయ్య, ఒకరోజున నాకు నేర్చుకోవడానికి నాకు ఒక బైబిల్ వచనం ఇచ్చాడు. "సబ్బాతు దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము." (నిర్గమకాండము 20:8) . ఈ వచనం నాలో ఏదో మార్పు తెచ్చింది.

నాకు 13 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు ఒక ఎడ్వెంటిస్ట్ పాస్టర్ మా ద్వీపంలో సువార్త సభలు నిర్వహించాడు. ఆ సభలకు నేను హాజరయ్యాను మరియు ఎడ్వెంటిస్ట్ పాస్టర్ బోధించిన మాటలు నా హృదయంలోకి లోతుగా చొచ్చుకుపోయాయి. నేను బాప్తిస్మం తీసుకోవాలని నిర్ణయించుకున్నాను. బాప్తిస్మానికి ముందు, పాస్టర్ "ప్రభువా, దయచేసి ఈ యువకుడిని మీ సేవలో ఉపయోగించుకోండి" అని ప్రార్థించాడు.

నా తండ్రి మరణించిన తర్వాత, జీవితం కష్టతరమైంది. కానీ నా చర్చి కుటుంబం నాకు సహాయం చేసింది. మరియు చర్చి తోటలో కలుపు తీయడం మరియు చర్చి గంట

మోగించడం వంటి చిన్న చిన్న పనులు చేయడం ద్వారా నేను వారికి సహాయం చేయడం ప్రారంభించాను. తరువాత, నేను చర్చిడీకన్( పరిచారకుడు) అయ్యాను మరియు తరువాత సంఘపెద్దను (చర్చి ఎల్డర్) అయ్యాను.

2001లో, నేను వనాటులోని మరొక ప్రాంతానికి వెళ్లాను. నేను అక్కడ నున్న ఎడ్వెంటిస్ట్ చర్చిలో చేరాను మరియు పాటల బృందం లో భాగమయ్యాను. సంగీతం ద్వారా నా విశ్వాసాన్ని పంచుకున్నాను. పాడటం ద్వారా దేవునిని స్తుతించే వాడిని. అది నా బోధనా మార్గం. నేను ప్రసంగీకుడను కాదు. కానీ నేను పాడినప్పుడు, నేను సజీవంగా ఉన్నట్లు భావించాను.

ఒక రోజు, నేను నా ద్వీపానికి తిరిగి వెళ్ళాను. అక్కడి ఒక పాస్టర్ నన్ను వరుసగా కొన్ని రోజుల పాటు జరిగే సువార్త సభలలో పాల్గొనమని ఆహ్వానించాడు. నేను ప్రతి సాయంత్రం కీర్తనలు పాడాను. ఒక మధ్యాహ్నం, ఆ పాస్టర్, ఎడ్వెంటిస్ట్ సందేశాన్ని వనాటు ప్రాంతానికి మొదటిగా తీసుకువచ్చిన మిషనరీ "నార్మన్ వైల్స్" గారి సమాధిని సందర్శించమని నన్ను అడిగాడు.

సమాధి దగ్గర నిలబడి, "దేవా, నేను కూడా మిషనరీని కావాలనుకుంటున్నాను." మిషనరీ అంటే ఏమిటో నాకు నిజంగా తెలియదు, కానీ ప్రజలు యేసును తెలుసుకోవడానికి నేను సహాయం చేయాలనుకుంటున్నాను" అని నేను ప్రార్థించాను. ఆ తర్వాత, నాకు ఒక కల వచ్చింది. ఎడ్వెంటిస్టులు నివసించని ద్వీపాల సమూహం అయిన టోర్రెస్‌కు నేను వెళ్లాలని దేవుడు కోరుకుంటున్నాడని నేను తెలుసుకున్నాను. నా దగ్గర డబ్బు లేదు మరియు అక్కడ ఎవరూ నాకు తెలియదు, కానీ నేను, "దేవా, నేను అక్కడికి వెళ్లాలని మీరు అనుకుంటే, దయచేసి నాకు ఒక మార్గం చూపండి" అని ప్రార్థించాను. దేవుడు నా ప్రార్థనకు సమాధానం యిచ్చాడు. నేను టోర్రెస్‌లో ఏడు సంవత్సరాలు గడిపాను, కొత్త స్నేహితులను ఏర్పరచుకున్నాను మరియు కొత్త చర్చిలను ప్రారంభించాను.

చాలా సంవత్సరాల తర్వాత, మలేకులలో జరిగిన ఒక సంగీత కార్యక్రమంలో, నేను నా పుస్తకాలను కిటికీలోంచి విసిరివేసిన నా పాత ఉపాధ్యాయురాలిని చూశాను. ఆమె కన్నీళ్లతో నా దగ్గరకు వచ్చి, నాకు ఒక పుచ్చకాయ ఇచ్చి, "నేను నీ గురించి మాట్లాడిన మాటలకు నన్ను క్షమించండి" అని చెప్పింది. ఆమె కూడా సెవెంత్-డే అడ్వెంటిస్ట్ అయ్యారు!

నేడు, నేను ఇప్పటికీ చర్చిలో సంఘపెద్దగా ఉన్నాను. నేను దేవుని ప్రేమను పంచుకుంటూ కొత్త చర్చిలను ప్రారంభిస్తూనే ఉన్నాను. నేను పాఠశాలలో విఫలమై ఉండవచ్చు, కానీ దేవుడు నా కోసం ఒక ప్రణాళికను కలిగి ఉన్నాడు. దేవుడు బైబిల్ లో మనకు ఈ విధంగా చెబుతున్నాడు: " నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రాబోవు కాలమందు మీకు నిరీక్షణకలుగునట్లు గా అవి సమాధానకరమైన ఉద్దేశములేగాని హానికరమైనవి కావు ఇదే యెహోవా వాక్కు". (యిర్మీయా 29:11).

ఆ వాగ్దానం నా కోసమే. మరియు అది మీ కోసమే! జాన్ జోసెఫ్, మైకా తుయిమాకు చెప్పినట్లుగాఈ త్రిమాసము యొక్క మీ పదమూడవ సబ్బాతు కానుకలు సోలమన్ దీవులు మరియు వనువాటులోని పిల్లల ఆరోగ్య ప్రాజెక్టులకు సహాయపడుతుంది. మీరు ధారాళముగా కానుకలు ఇచ్చుచున్నందులకై మీకు కృతజ్ఞతలు !

-జాన్ జోసెఫ్